# ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

## జిల్లా దేవాదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ



అధికారులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ సుప్రియ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 14 : జిల్లాలోని దేవాలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా దేవాదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. శాఖ కార్యాలయంలో ఈవో, మేనేజర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని బడా రాంమందిర్ భూములు, కౌలు, హుండీ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. బడా రాంమందిర్ మఠానికి సంబంధించి నిజామాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల్లో 440.06 ఎకరాలు, జిల్లాకేంద్రంలో 213. 10 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ భూములకు కౌలు విధానం ద్వారా వస్తున్న ఆదాయ నిర్వహణలోనూ లెక్కలు సరిగ్గాలేవని తెలిపారు. జిల్లాలోని ఆలయ భూములను ఎవరైనా ఆక్రమిస్తే, ఆ వివరాలను దేవాదాయశాఖకు తెలియజేసి సహకరించాలని కోరారు. ఎవరైనా ఆలయ భూములను ఆక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయాల ఈవోలు, మేనేజర్లు, శాఖాధికారులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని గాంధీనగర్ పరిధిలో గురువారం అల్లెపు లక్ష్మి (28) తన ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్తతో గొడవపడడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కోస్లీలో మరొకరు..

నవీపేట, డిసెంబర్ 14: మండలంలోని కోస్లీ ఫకీరాబాద్ గ్రామంలో ఓ వ్యక్తి జీవితం మీద విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంచరి నాగన్న(50) కొన్నేండ్లుగా కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు ఎవరూలేకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది పదిరోజుల క్రితం తనకున్న రేకుల షెడ్డులో తాడుతో ఉరేసుకొన్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి స్థానికులకు దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా వైద్య శాలకు తరలించారు. మృతుడి సోదరుడు కంచరి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గోదావరినదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెంజల్, డిసెంబర్ 14 : మండలంలోని కందకుర్తి గోదావరినదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైనట్లు రెంజల్ ఎస్సై పి. ఉదయ్‌కుమార్ తెలిపారు. వీఐపీ దారిలోమొదటి పుష్కర ఘాట్ సమీపంలో గుర్తు తెలియని శవం కనిపించడంతో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 50 నుంచి 60 ఏండ్లు ఉంటుందని తెలిపారు. మృత దేహాన్ని వారి బంధువులు, కుటుంబీకుల కోసం దవాఖాన మార్చురీలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆచూకీ, సమాచారం కోసం రెంజల్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

## బోధన్ తహసీల్దార్ ఎదుట పలువురి బైండోవర్

శక్కర్‌నగర్, డిసెంబర్ 14: బోధన్ పట్టణ శివారులోని పలు దాబా హోటళ్ల యజమానులను గురువారం ఎక్సైజ్ అధికారులు బోధన్ తహసీల్దార్ కె. గంగాధర్ ఎదుట బైండోవర్ చేశారు. దాబా హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయించడంతో పాటు మద్యం సేవిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు సదరు దాబాలను గుర్తించి యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. మద్యం విక్రయించినా, సేవించేందుకు అనుమతిచ్చినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## కార్మికులకు దుస్తుల అందజేత

బాల్కొండ, డిసెంబర్ 14: మండలంలోని జలాల్‌పూర్‌లో కరుణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, అనాథలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు వినీల్, బాలాజీ, రాజ్‌కుమార్, రవితేజ పాల్గొన్నారు.



ఇటుక బట్టీ కార్మికులకు దుస్తులను అందజేస్తున్న మహేశ్‌కుమార్

# రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్14: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో గురువారం నిజామాబాద్ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుంచి 21 వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు సికింద్రాబాద్‌లో జరిగే 69వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు.

# వ్యక్తిపై హత్యాయత్నం

- గొంతు కోసి పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

సిరికొండ, డిసెంబర్ 14 : మండలంలోని దూప్యాతండాకు చెందిన భూక్యా రవిపై అదే గ్రామానికి చెందిన మలావత్ వినోద్ గురువారం సాయంత్రం దాడి చేసి కత్తితో గొంతు కోయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమన్‌పల్లి జీపీ భవనం వెనుక ఖాళీ స్థలంలో ముగ్గురు మద్యం సేవించేందుకు వెళ్లారు. భూక్యా రవి కూడా అక్కడికి మద్యం సేవించేందుకు వెళ్లాడు. గమనించిన వినోద్ అక్కడికి వెళ్లి వారితో మాట్లాడుతూనే వెనకాల నుంచి వచ్చి రవి గొంతు కోశాడు. మిగతా ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. పాతకక్షలతోనే దాడి చేసి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. అనంతరం వినోద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడంతో సీఐ సైదా, ఎస్సై రమేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అపస్మారక స్థితిలో ఉన్న రవిని భీంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

# కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె



ధర్పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు



ఆర్మూర్‌లో..

ధర్పల్లి/ ఇందల్వాయి/ఆర్మూర్ టౌన్/ బోధన్/నవీపేట/ మాక్లూర్, డిసెంబర్ 14 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకున్నది. జిల్లాలోని ధర్పల్లి, ఇందల్వాయి, ఆర్మూర్, నవీపేట, మాక్లూర్, బోధన్ మండల కేంద్రాల్లో పోస్టల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోస్టల్ ఉద్యోగులకు 8 గంటల పని, పెన్షన్‌తో సహ అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ. 5 లక్షలకు, గ్రాట్యుటీని రూ. 5 లక్షలకు పెంచడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## గ్రంథాలయానికి కుర్చీలు, అల్మారాల అందజేత

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 14 : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకుల సౌకర్యార్థం రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో 50 కుర్చీలు, 6 గ్లాస్‌డోర్ అల్మారాలను అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డికి గురువారం వీటిని అందజేశారు. దాతలకు సంస్థ కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, పూర్వ అధ్యక్షుడు ధర్మపురి సురేందర్, తారకం, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పరుగుపందెంలో సిరికొండ విద్యార్థికి బంగారు పతకం



అనుదీప్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగాప్రసాద్

సిరికొండ, డిసెంబర్ 14 : ఢిల్లీలో ఇండియన్ నేషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించిన 5 కిలోమీటర్ల జాతీయస్థాయి పరుగుపందెంలో సిరికొండ మోడల్ కళాశాలకు చెందిన అనుదీప్ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. 3 కిలోమీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగాప్రసాద్ తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ కిషన్, ఉపాధ్యాయ బృందం అనుదీప్‌ను గురువారం అభినందించారు.

## తెలుగు వెలుగు సమాఖ్య వార్షికోత్సవం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 14 : నగరంలోని సీతారాంనగర్ కాలనీ మాతృ సంస్థ కార్యాలయంలో తెలుగు వెలుగు సమాఖ్య 43వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యాఖ్యాన సామ్రాట్ వీపీ చందన్‌రావు హాజరై మాట్లాడారు. పలు అంశాల్లో ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని సన్మానిస్తున్న తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో అయాచితం నాగరాజుశర్మ, గణపతి అశోకశర్మ, కాసర్ల నరేశ్, చంద్రశేఖర్‌శాస్త్రి పాల్గొన్నారు. అనంతరం సమాఖ్య ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు.

## గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన హర్షణీయం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 14 : రాష్ట్రంలో సమ్మక్కసారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలుపడంపై తెలంగాణ రచయితల వేదిక హర్షం వ్యక్తం చేసింది. నగరంలోని వినాయక్‌నగర్ సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ప్రేంలాల్ గురువారం విలేకరులతో మాట్లాడారు. దేశచరిత్రలోనే గిరిజన విశ్వవిద్యాలయాన్ని మన రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొప్పదన్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో వేదిక సభ్యులు లక్ష్మణ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 14 : గిరిరాజ్ కళాశాలలో పీజీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయడంతోపాటు రూ.36 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. టీయూ అడ్మిన్ భవనం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. జీజీ కళాశాలలో సుమారు 90 శాతం పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, రూ. 36 వేలకు ప్రభుత్వం రూ.20 వేలు చెల్లిస్తున్నదని, మిగతా రూ. 16 వేలు విద్యార్థులే కట్టాలని ప్రిన్సిపాల్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా కోశాధికారి దేవిక, యూనివర్సిటీ నాయకులు శివసాయి, రవీందర్, రామకృష్ణ, అక్షయ్, ఆకాశ్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

మాక్లూర్, డిసెంబర్ 14 :మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపులే కళాశాలకు చెందిన టి. సంజన (ప్రథమ సంవత్సరం) రాష్ట్రస్థాయి వాలీబాల్ (అండర్–17) పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాళ్లు రజిత, సాత్విక గురువారం తెలిపారు. తమిళనాడులోని తిరుచానూరులో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థిని సంజనను ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## డీఏలను వెంటనే విడుదలచేయాలి

బోధన్, డిసెంబర్ 14: ప్రభుత్వ పెన్షనర్లు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. గురువారం పట్టణంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశాన్ని బోధన్ డివిజన్ అధ్యక్షుడు వి.విక్రమ్ కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. డీఏ బకాయిలను వెంటనే విడుదలచేయడంతో పాటు పెన్షనర్లకు ప్రతి నెలా 31వ తేదీన పెన్షన్ మొత్తాలను జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వి.వెంకటావు, బోధన్ డివిజన్ కార్యదర్శి అద్దంకి ఉషాన్ పాల్గొన్నారు.